## క్లుప్తంగా

### ఉత్సాహంగా క్రీడాపోటీలు



ఎమ్మిగనూరులో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్, చైర్మన్

ఎమ్మిగనూరుటౌన్: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వారు ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి మండల స్థాయిలో గెలుపొందిన జట్లకు క్రీడా పరికరాలను అందజేశారు. ఆయా పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. స్పెషల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, డీఎల్‌డీఓ షఫి, ఎంపీడీఓలు బంగారమ్మ, ప్రవీణ్‌కుమార్, దశరథరామయ్య, ఎంఈఓలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా ప్రదర్శన

ఆస్పరి: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శించినట్లు తహసీల్దార్ కుమారస్వామి బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 51,795 మంది ఉండగా, ఇందులో 26,225 మంది పురుషులు, 25,566 మంది స్త్రీలు, ఇతరులు నలుగురు ఉన్నారన్నారు. ఓటర్లకు ఏవైనా అభ్యంతరాలుంటే బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.

### పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు

ఆలూరు రూరల్: మొలగవల్లి పీహెచ్‌సీలో ఇక నుంచి 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓపీ ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో ఒక డాక్టర్ అందుబాటులో ఉంటారని ప్రజలకు తెలియజేశారు. ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్లు నలుగురు నర్సులతో పాటు ఒక ల్యాబ్ టెక్నిషియన్, ముగ్గురు సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సుఖప్రసవాలతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు.

### నాటుసారా స్థావరాలపై దాడులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల కొండల్లో బుధవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి సీఐ హనుమంతప్ప, దేవనకొండ సీఐ శ్రీనివాసులు, ఆలూరు ఎస్‌ఐ ఓబులేసు, పోలీస్ సిబ్బంది నాటుసారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయడంతో పాటు కైరుప్పల గ్రామంలో రామాంజిని అనే వ్యక్తి నుంచి 30 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని ఆస్పరి సీఐ కోరారు.

### భక్తిశ్రద్ధలతో సుంకులమ్మ దేవర

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో సుంకులమ్మవ్వ ఊరి దేవర ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు తలపై పెట్టుకొని తప్పెట్లు, మేళతాళాలతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి సమర్పించారు. బంధుమిత్రుల రాకతో గ్రామం కిక్కిరిసింది. ప్రధాన రహదారి కావడంతో వన్‌వే ద్వారా పోలీసులు వాహనాలను పంపించారు. దీంతో వాహనాలు బారులు తీరాయి. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు, సర్పంచ్ రాచప్ప, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ పుష్పావతి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

హొళగుంద: త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నజీర్ అహమ్మద్ కోరారు. బుధవారం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఉర్దూ మీడియం విద్యార్థినులకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం, టీచర్లతో కలిసి పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు.

### పీహెచ్‌సీల తనిఖీ



తనిఖీ చేస్తున్న మలేరియా అధికారి చంద్రశేఖర్

హాలహర్వి: మండల కేంద్రంతో పాటు అర్ధగేరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా ఆఫీసర్ సి.చంద్రశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులకు సరైన వైద్యం అందించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్లు మన్సూర్‌వలీ, గంగాధర్, సూపర్‌వైజర్లు అబ్రహం, ఆదినారాయణ, సీహెచ్‌ఓలు మహేశ్వరి, మోహన్ తదితరులు ఉన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఆసరా కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



పొదుపు మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీదేవి
- నాల్గో విడతలో 552 సంఘాలకు రూ.3.61 కోట్లు మంజూరు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

మద్దికెర: కరోనా కష్టకాలంలోనూ అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి వుంటామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాలులో 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని పారంభించారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద 552 సంఘాలకు మంజూరైన రూ.3.61 కోట్ల చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే, పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా రూ. 14.44 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఐకేపీ ఏపీఎం మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

### పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫథకాలు

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం కృష్ణగిరి మండలం ఆగవేలికి చెందిన ఉప సర్పంచ్ బోయ రాముడుతో పాటు మరికొంత మంది ఈ మధ్యనే టీడీపీలో చేరి వారం రోజుల్లోనే తిరిగిరావడంతో వారికి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డితో కలిసి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కృష్ణగిరి మండలం ఇప్పటివరకు రెండు బలమైన కుటుంబాల మధ్య నలిగిపోయిందన్నారు. కేఈ, కోట్ల కుటుంబాలు వారి స్వార్థ రాజకీయాల కోసం ఇక్కడి ప్రజలను పావుగా వాడుకున్నారే తప్పా గ్రామాలను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. వారి అధిపత్యం కోసం మండలంలో ప్రజావ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఆ రెండు కుటుంబాలను ఎదుర్కోవడంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తమ వెంట నడిచిన కృష్ణగిరి మండల ప్రజలకు తమ కుటుంబం ఏళ్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలం ఎప్పుడినప్పటి నుంచి కేఈ కుటుంబానికి కంచుకోటగా ఉన్న కృష్ణగిరిలో రెండేళ్ల క్రితం జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో చరిత్ర తిరగరాసి వైఎస్సార్‌సీపీకి మెజారిటీని ఇస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అలాగే కష్టకాలంలో తమ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉన్న ఈ మండలాన్ని దివంగత నారాయణరెడ్డి ఆశయ సాధన లక్ష్యంగా ఫ్యాక్షన్ వద్దు.. అభివృద్ధే ముద్దు అనే నినాదంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ వారు చెప్పే కల్లబొల్లి మాటలు ఎవ్వరు నమ్మవద్దన్నారు. ఉపసర్పంచ్ బోయ రాముడు మాట్లాడుతూ వారం రోజుల క్రితం తమను టీడీపీ వారు పనిఉందని పత్తికొండకు తీసుకెళ్లి పార్టీ కండువాలు కప్పారన్నారు. అంతేగానీ తాము ఆ పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు. కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, ఆగవేలి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సూదేపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి, విగ్రహ కమిటీ ప్రతినిధులు వినోద్, నాగేశ్వరరావు, చందు తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఉంటుందని, పెద్దలు, గ్రామస్తులు, అభిమానులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### పైపులైన్ మరమ్మతులకు చర్యలు

ఆలూరు రూరల్: వచ్చే వేసవిని దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీతో పాటు అన్ని పంచాయతీల్లో తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల విస్తరణ, అభివృద్ధి అధికారి ప్రకాష్‌నాయుడు అన్నారు. ఆయన బుధవారం ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ.. పట్టణంలో 6 చోట్ల పైపులైన్ లీకేజీ సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. మరమ్మతులు చేపట్టేందుకు గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఖర్చు అంచనాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైవే 167 నిర్మాణంలో భాగంగా డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నప్పుడు ప్రధాన పైపులైన్ లీకేజీ సమస్య వేధిస్తోందన్నారు. బాపురం రిజర్వాయర్, విరుపాపురం రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా అయ్యే అన్ని గ్రామాల పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి నాటికి జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ వెల్లడించారు.

### పీఎస్‌లకు రిజిస్ట్రేషన్ అధికారం

ఆలూరు: సచివాలయాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు (పీఎస్) ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ అధికారం కల్పించిందని ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ ఎంవీ మురళీ సురేంద్రరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి మండలాల పీఎస్‌లకు రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### వికసిత్ భారత్ యాత్ర

హాలహర్వి: మండలంలోని గూళ్యం, సిద్ధాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఆంతోనీ, బీజేపీ మండలాధ్యక్షులు బసవరాజు, సర్పంచ్ మన్మథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. బీజేపీ ఉపాధ్యక్షులు ఎస్.ఎం.స్వామి, సర్పంచ్ ఉలిగమ్మ, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే వివక్ష చూడకుండా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. అందరి సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టి.గోకులపాడు, కంబాలపాడు గ్రామాల సమీపంలో రూ.10 కోట్లతో రెండు బ్రిడ్జీలు మంజరయ్యావని పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. అలాగే తొగర్చేడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోయ సుశీల, పత్తికొండ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాధవరావు, కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలూరు సెబ్ సీఐగా సోమశేఖర్



ఆలూరు రూరల్: సెబ్ సీఐగా సోమశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎర్ర వెంకట్ కల్యాణదుర్గంకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కల్యాణదుర్గం నుంచి సోమశేఖర్ ఆలూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సెబ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. క్షేత్రగుడి, మార్లమడికి చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



కబడ్డీ క్రీడాకారులతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

## ఆటలతోనే ఆరోగ్యం

పత్తికొండ టౌన్: ఆటలతో వ్యాయామం తద్వారా ఆరోగ్యం, మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె బుధవారం స్థానిక జూనియర్ కాలేజీ మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, ప్రారంభ మ్యాచ్‌లను రిబ్బన్ కట్ చేసి, టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులకు సామగ్రి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు సత్తా చాటుకోవాలని పిలుపునిచ్చారు. చదవుతోపాటు ఆటల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ కవిత, సీఐ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: 'ఆడుదాం–ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ క్రీడలో ఆలూరు జట్టుపై గుండ్లకొండ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టును పీఈటీలు అభినందించారు. గెలుపొందిన జట్టు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ బాలుర–2 హైస్కూల్ మైదానంలో బుధవారం ఎంపీడీఓ అల్లబకాష్ నియోజకవర్గం స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. యువత క్రీడాస్ఫూర్తితో రాణించి ప్రతిభ చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ–2 చిరంజీవరెడ్డి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

### నాడు - నేడుతో విద్యాభివృద్ధి



ఏపీజీటీఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈఓ, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడు ద్వారా పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోందని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (ఏపీజీటీఏ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘ నాయకులతో కలిసి జెడ్పీ సీఈఓ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని సూచించారు. గోనెగండ్ల ఎంపీడీఓ, ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, రామాంజనేయులు, సంఘ నాయకులు రాజారాం మోహన్, శ్రీనివాసులు,మూర్తి, హేమలత, సువర్ణమ్మ, శ్రీదేవి, స్వర్ణలత, సబిహాసుల్తాన తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిప్పగిరి: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ బాలనాయుడు సూచించారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పార్వతి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసులు

నందవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఫీల్డ్ అసిసెంట్లకు ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏపీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో ఉపాధి పనులు కల్పించడంతో పాటు కూలీల సంఖ్య పెంచాలన్నారు. నీటి కుంటల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా చెరువులలో పనులను గుర్తించాలన్నారు. మండలంలో నందవరం, మాచాపురం, పూలచింత, హాలహర్వి తదితర గ్రామాల్లోని చెరువులలో పనులను గుర్తించి, ఉపాధి పనులు చేపట్టాలన్నారు. అలాగే ఉద్యాన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈసీ నూర్జహాన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### అక్కాచెల్లెమ్మలకు ఆసరా



ఎమ్మిగనూరులో పొదుపు సభ్యులకు చెక్కును అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్



హాజరైన పొదుపు మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో రుణమాఫీ సొమ్మును వారి ఖాతాల్లో జమచేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు అండగా నిలిచారని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ ఆసరా పథకం కింద ఎమ్మిగనూరు పట్టణంలోని 1660 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మంజూరైన రూ.10.11 కోట్లు, మండలంలోని 784 గ్రూపులకు రూ.4.10 కోట్ల మెగా చెక్కులను తహసీల్దార్ ఆంజనేయులు, మెప్మా పీడీ నాగశివలలీల, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, రాష్ట్ర కుర్ణి కరికాల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న మహిళాభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. దీంతో నేడు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాయని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్ష.అధికార ప్రతినిధి బుట్టారంగయ్య, సునీల్‌కుమార్, మెప్మా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు హేమలతా రెడ్డి మాట్లాడారు. కౌన్సిలర్లు పూజేశ్వరి, రామాంజినమ్మ, నీలకంఠ, కేశవరెడ్డి, శివప్రసాద్, గట్టుఖాజ, మెప్మా సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మద్దికెరలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వరలక్ష్మి

మద్దికెర: వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పత్తికొండ ఆర్డీఓ వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆమె బుధవారం బురుజుల గ్రామంలో ఓటింగ్ యంత్రాల ప్రదర్శనను పరిశీలించారు. మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని గ్రామాలలో ప్రజలకు ఈవీఎం మిషన్ ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ నాగభూషణం, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో శివన్న తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

గోనెగండ్ల: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలలో గోనెగండ్ల మోడల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని తేజశ్విని ప్రతిభ చాటిందని ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్ తెలిపారు. పోటీల్లో మూడవ స్థానం సాధించడంతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సృజన చేతుల మీదుగా మొమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

### జాతీయ స్థాయిలో ప్రతిభ

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల ముంబైకి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ సంస్థ నిర్వహించిన నేషనల్ ఆర్ట్ కాంపిటిషన్‌లో పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటారు. కలరింగ్ పోటీల్లో ఎల్‌కేజీకి చదువుతున్న కస్తూరి గౌతమ్ సిద్దార్థ్ గోల్డ్‌మెడల్, హ్యాండ్ రైటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించగా, 2వ తరగతికి చెందిన కస్తూరి రిషికిరణ్ సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు కోటేశ్వరరావు, మారుతి బుధవారం తెలిపారు.

### మర్యాదపూర్వక కలయిక

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి బుధవారం జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలపై వారితో చర్చించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగప్ప, లోకనాథ్, వెంకటేశ్, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి

హాలహర్వి: వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకెళ్దామని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కృష్ణ, వీరదాసు, నాగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బాపురం గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షిని కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు శివరాజ్‌గౌడ్, మెదేహాల్ ఎర్రిస్వామి, రమేష్, సుధ,మద్దిలేటి,తదితరులు పాల్గొన్నారు.

### వేగవంతంగా కులగణన సర్వే

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మండలంలో వేగవంతంగా సాగుతోంది. ఉదయం నుంచే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబసభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలో కులగణన సర్వే బుధవారం నాటికి 42 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. మండలంలో మొత్తం 18,113 ఇళ్లు ఉండగా 62,037 మంది జనాభా ఉన్నారు. యాప్‌లో వివరాల నమోదు చేసే పనిని వేగవంతం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

### పేదలకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్లు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో.. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 27వ తేదీ నుంచి ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టనుందని తెలిపారు. మండలంలో జగనన్న కాలనీలో 450 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. వారందరికీ రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. అలాగే మండలంలోని ఓటర్ల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యతరాలు ఉంటే తమను సంప్రదించవచ్చన్నారు. మండలంలో మొత్తం ఓటర్లు 46,466 మంది ఉన్నారని తెలిపారు. డీటీ రఘువీర, ఆర్‌ఐ జెర్మియా, హౌసింగ్ ఏఈ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సంబరాలు



ఎమ్మిగనూరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్: అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో బుధవారం ఎమ్మిగనూరులో సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని దీక్ష శిబిరం వద్ద కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్, రూరల్ కార్యదర్శులు నాగలక్ష్మి, శైలజ, నీరజ, సీపీఐ కార్యాలయం దగ్గర నాయకురాళ్లు కృష్ణవేణి, నాగశిరోమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.